క్లుప్తంగా

'ఉత్తరాంధ్రలో అపార మేధో సంపత్తి'



లక్ష్మీనారాయణతో ఏపీ బీసీ వెల్ఫేర్ ప్రతినిధులు

బీచ్ రోడ్డు : ఉత్తరాంధ్రలో మేధో సంపత్తికి కొదవలేదని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. సిరిపురంలోని తన నివాసంలో ఆయనను ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో మానవ వనరులు, సహజ వనరులు అపారంగా ఉన్నాయన్నారు. వాటి సద్వినియోగంతోనే ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ నెల 29న తక్షశిల ఐఏఎస్ అకాడమీలో నిర్వహించనున్న ప్రతిభా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తక్షశిల ఐఏఎస్ అకాడమీ వైజాగ్ నిర్వాహకుడు గంజి సాయిరాం, ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హనుమంతు లక్ష్మణరావు, ఐటీ విభాగం నాయకులు పల్లా త్రినాథ్, మోహన్ పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయానికి అప్పన్న పేరు పెట్టాలి



శ్రీనివాసానంద సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న శ్రీసింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య సభ్యులు

ఎంవీపీ కాలనీ: భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి సింహాద్రి అప్పన్నస్వామి పేరు పెట్టాలని శ్రీసింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య సభ్యులు కోరారు. ఇందు కోసం కృషి చేయాలని కోరుతూ ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీకి సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు సనపల నారాయణస్వామి మాట్లాడుతూ అప్పన్న స్వామి ఉత్తరాంధ్రతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న భక్తులకు దేవదేవుడు అన్నారు. అలాంటి స్వామివారి పేరును విమానాశ్రయానికి నామకరణం చేయాలని కోరారు.

గురుకులంలో పేరుకుపోయిన చెత్త



శ్రీకృష్ణాపురం గురుకులంలో తరగతి గదుల పక్కనే నిల్వ ఉన్న చెత్త

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణం చెత్తతో అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ ఎండిన చెట్ల కొమ్మలు, కాగితాలు, పేపరు ప్లేట్లు తరగతి గదుల పక్కనే దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు గురుకులం ఆవరణలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. వాటిని కూడా తొలగించకుండా వదిలేశారు. చెత్త వల్ల దుర్వాసన వస్తోందని, దట్టమైన పిచ్చిమొక్కలు కారణంగా దోమలతో ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు స్పందించి గురుకులం ఆవరణాన్ని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

జీ20 సదస్సుతో విశాఖకు ఒరిగేదేముంది?

సీతంపేట: జీ20 సదస్సు నిర్వహణ వల్ల విశాఖకు ఒరిగేదేమైనా ఉందా అని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని జీ20 సదస్సు నిర్వహణకు రూ.150 కోట్లు వెచ్చించి రోడ్లు, వీధి లైట్లు, బ్యూటిఫికేషన్ చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ ఇటీవల తెలిపారన్నారు. జీ20 సదస్సు వల్ల విశాఖకు ఏమైనా పెట్టుబడులు వస్తాయా? అని ప్రశ్నించారు.

సానుకూల దృక్పథం అవసరం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- సైకాలజీ విభాగంలో రెండు రోజుల సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: సానుకూల దృక్పథంతో పని చేయడం విద్యార్థి దశ నుంచి అలవరచుకోవాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ సైకాలజీ విభాగంలో రెండు రోజుల పాటు జరిగే 'నేషనల్ సెమినార్ ఆన్‌రోల్ ఆఫ్ ఫోరెన్సిక్ సైకాలజిస్ట్ ఇన్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్' సదస్సును శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన అంశాలను అభ్యసించే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ఇతరుల భావాలను గుర్తించే సామర్థ్యం సైకాలజిస్ట్‌లకు అవసరమన్నారు. స్వీయ అభ్యసనం ఎంతో అవసరమని చెప్పారు. నేరాలు జరిగిన సందర్భాలలో ఇటీవల కాలంలో ఫోరెన్సిక్ సైకాలజిస్ట్‌ల ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. ఇటువంటి సమయంలో వీరు అందించే వివరాలు, నివేదికలు తీర్పులు వెలువరించడంతో ప్రభావం చూపుతాయనే విషయం గుర్తించాలన్నారు. ఫోరెన్సిక్ సైకాలజిస్ట్‌లు పోలీసులు, న్యాయ, కారాగార, స్వచ్ఛంద సంస్థలు, బాధితులు, దోషులు ఇలా విభిన్న వ్యవస్థలు, వ్యక్తులతో పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా తమ సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశిష్ట అతిథి సీబీఐ–ఏసీబీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.మురళి మాట్లాడుతూ ఫోరెన్సిక్ సైకాలజిస్ట్‌లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేరగాళ్ల మనస్సును చదివే ప్రయత్నం చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఫోరెన్సిక్ కిట్ ఉంటుందని, నేరం జరిగిన సందర్భాలను విశ్లేషించడం, నేరగాళ్ల నుంచి నిజాన్ని రాబట్టడం తదితర ప్రక్రియలను వివరించారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌కు స్వాగతం



పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న పితాని ప్రసాద్ తదితరులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు బీసీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. బీసీ జనగణన కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి పంపించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ మంత్రుల పర్యవేక్షణలో రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతికి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కాగితాల రామారావు గౌడ్, డాక్టర్ వేణుగోపాల్, వెంకటేష్‌గౌడ్, గోవింద్, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్లకు సత్కారం



సర్వేయర్లను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూరీసర్వేలో భాగంగా జిల్లాలోని 11 గ్రామాల్లో భూసర్వే విజయవంతంగా పూర్తయింది. దీంతో ఆయా గ్రామాల్లో సర్వేను వేగవంతంగా పూర్తి చేసిన సర్వేయర్లను ఏపీ సర్వేయర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ ఇసుకతోట దరి ఓ సమావేశ మందిరంలో ఏపీఎస్ఈఏ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపన కనకబాబు అధ్యక్షత ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్వేయర్లు ప్రసాదరావు(కమనం గ్రామం), దేవి (ఎన్‌జీఆర్ పురం గ్రామం), పద్మావతి (చిన్నాపురం గ్రామం), లావణ్య (బుడ్డివలస గ్రామం), లలిత, చిరంజీవి, సంతోష్ (తిమ్మాపురం గ్రామం), అప్పలరెడ్డి(ఆర్.వై.అగ్రహారం), వినోద్(నిడిగట్టు), లక్ష్మణ్ (రాజయ్యపేట)లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఈటీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మాతా ప్రసాద్, భీమిలి మండల సర్వేయర్ రమేష్, భీమిలి తాలూకా అధ్యక్షుడు మణిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య



అడవివరం హైస్కూల్‌లో ప్రధాని ప్రసంగం వీక్షిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ప్రధాని మోదీ 'పరీక్ష పే చర్చ' పేరిట శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు వీక్షించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాలను వినియోగించి.. ప్రధాని మోదీ ప్రసంగం వీక్షించేలా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఒత్తిడి లేని రీతిలో చదువులు సాగాలనే ప్రధాని ప్రసంగం దిక్సూచి కానుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు భాగస్వాములయ్యారనే వివరాలను విద్యాశాఖాధికారులు సేకరించారు. విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం వెబ్‌సైట్‌లో ఈ వివరాలు పొందుపరిచారు. పరీక్షల సమయంలో ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు.

పోరాటాలను అవహేళన చేస్తే మూల్యం తప్పదు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

ఉక్కునగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలను అవహేళన చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేకతపై పోరాడుతున్న వారిలో మత విద్వేశాలను సృష్టించడం, ఐక్యతకు విఘాతం కలిగించడం, ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు ధారపోయడం కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ పరిశ్రమల రక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అనకాపల్లి జిల్లా సీఐటీయూ కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దారుణమన్నారు. జిల్లా జాక్ కన్వీనర్ ఎం.జగ్గునాయుడు, సీఐటీయూ నాయకులు వై.టి.దాస్, కె.ఎం.శ్రీనివాస్, ఎన్.రామారావు, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అలనాటి నటి జమున మృతి తీరని లోటు

- విశాఖతో జమునకు అవినాభావ సంబంధం



విశాఖ నగరంలో జమునను సత్కరిస్తున్న స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు(ఫైల్)

మద్దిలపాలెం: అలనాటి కథానాయిక జమునకు విశాఖతో అవినాభావ సంబంధం ఉంది. విశాఖ వేదికగా నిర్వహించే పలు సినీ కార్యక్రమాలలో ఆమె ఎన్నోసార్లు పాల్గొని సందడి చేశారు. టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన అనేక కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. నగరానికి చెందిన స్నేహాంజలి ఆర్ట్స్ అకాడమీ అధినేత మూర్తి సంస్థ వార్షికోత్సవానికి జమునను ఆహ్వానించి సత్కరించారు. నగరానికి చెందిన ఘంటసాల కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా ఆమెకు సన్మానం చేశారు. తెలుగు, హిందీ, తమిళ తదితర భాషలలో నటించి ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయిన జమున అకాల మరణం చాలా బాధాకరమని ఘంటసాల కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అన్నారు. జమున మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సంతాపం తెలిపారు. జమున సంతాప సభ ఆదివారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఏయూ మానవ వనరులు అభివృద్ధి శాఖ ప్రాంగణంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

'మార్చి నాటికి కైలాసగిరి పార్కు సుందరీకరణ'

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం కైలాసగిరి పార్కును మార్చి నాటికి సుందరంగా తయారు చేస్తామని వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజినీర్ శివప్రసాద్‌రాజు తెలిపారు. 'అధ్వానంగా కైలాసగిరి పరిసరాలు'అనే శీర్షికతో ఈ నెల 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీంతో ఈ ఏడాది మార్చిలో జరగనున్న జీ.20 సదస్సుకు పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని ఓ ప్రకటనలో తెలిపారు. కొండపై రాతి శిల్పాల పార్కులో నడకదారులు బాగు చేయడం, పచ్చదనం కోసం మొక్కలు నాటడం వంటి పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా శంఖు చక్ర నామాలు నుంచి తెలుగు మ్యూజియం వరకు సర్వీస్ రోడ్డులో డెక్ట్ పనులు, నడక మార్గం పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా రోడ్డు తవ్విన వైపు సందర్శకులు ఎవ్వరూ వెళ్లకుండా స్టాపర్లు అడ్డం పెట్టామన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి స్టాపర్లు తొలగిస్తామన్నారు. ఈ పనులు రూ.29 లక్షలతో జరుగుతున్నట్టు తెలిపారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రత వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాల గురించి వివరిస్తున్న ఆర్టీసీ డీపీటీవో ఎ.అప్పలరాజు

మద్దిలపాలెం: ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ)లో రోడ్డు భద్రత వారోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ ఉత్సవాలు వచ్చేనెల 2వ తేదీ వరకూ కొనసాగుతామని డీపీటీవో ఎ.అప్పలరాజు తెలిపారు. మద్దిలపాలెం డిపోలో డిపో మేనేజర్ అరుణ కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బందికి బస్సుల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎండాడ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో కాకినాడలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

నేడు డాక్టర్ శ్వేత కూచిపూడి నాట్య రంగ ప్రవేశం



మాట్లాడుతున్న కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఇన్‌చార్జి హనుమంతరావు

ఆరిలోవ: డాక్టర్ శ్వేత శనివారం కూచిపూడిలో రంగ ప్రవేశం చేయనున్నట్లు కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి హనుమంతరావు తెలిపారు. విశాఖ వేలీ స్కూల్ పక్కన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో శుక్రవారం నాట్యకారిణి శ్వేతతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28న సాయంత్రం 6.30 గంటలకు కళాభారతిలో రెండు గంటల పాటు నిరాటంకంగా నృత్య ప్రదర్శన చేయనున్నట్లు చెప్పారు. ఆమె 8వ ఏట నుంచే తన వద్ద నాట్యం నేర్చుకుంటూనే వైద్య విద్యను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇప్పుడు సహృదయ విద్వత్ జన సభ రంగ ప్రవేశం కోసం నాట్యం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో శ్వేత తండ్రి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నావికా దళ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న నావికా దళ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: ఈస్టర్న్ నావల్ కమాండ్ ఐఎన్ఎస్ సర్కార్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకులో జరిగిన ఈ శిబిరాన్ని కమాండ్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ఆర్.ఆర్.రవి ప్రారంభించారు. అనంతరం 17 మంది మహిళలతో పాటు 163 మంది సిబ్బంది రక్తదానం చేశారు.

ఆరేళ్ల తరువాత కుటుంబ సభ్యుల చెంతకు..



కుటుంబ సభ్యులకు సుభాష్‌ను అప్పగిస్తున్న మురళి, తదితరులు

ఎంవీపీ కాలనీ: మానసిక స్థితి బాగోలేక కుటుంబానికి దూరమైన సుభాష్ చంద్రబోస్ అనే వ్యక్తిని ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చంద్రబోస్ ఎలక్ట్రికల్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఆరేళ్ల క్రితం చెట్టు మీద నుంచి పడిపోవడంతో తలకు గాయమైంది. అప్పటి నుంచి మానసిక స్థితి బాగోకపోవడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే అక్కడి నుంచి తప్పించుకున్న సుభాష్ విశాఖ చేరుకున్నాడు. జగదాంబ కూడలిలో బట్టలు లేకుండా తిరుగుతున్న అతన్ని గమనించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు మహారాణిపేట పోలీసుల సహకారంతో విశాఖ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. కొంత కాలంగా చికిత్స పొందుతున్న సుభాష్ ఆరోగ్యం నయం కావడంతో తన కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేశాడు. దీంతో పెద్దాపురంలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం రెడ్ క్రాస్ ప్రతినిధులు మురళి ఆధ్వర్యంలో సుభాష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఏయూ ప్రాంగణంలో అనధికారికంగా కోళ్ల పెంపకం



క్రీడా మైదానం చుట్టూ తొలగిస్తున్న తుప్పలు



తుప్పల వెనక భాగంలో కోళ్ల పెంపకానికి వేసిన షెడ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా మైదానం వెనక భాగంలో కొందరు గుట్టుగా కోళ్ల పెంపకం చేపట్టారు. క్రీడా మైదానం చుట్టూ ఉన్న తుప్పలు తొలగించే పనులు ఏయూ అధికారులు చేపట్టారు. కొద్దిగా తుప్పలు తొలగించగానే వెనక భాగంలో భారీగా కోళ్ల పెంపకాన్ని అధికారులు గుర్తించారు. వర్సిటీకి చెందిన స్థలాన్ని అనధికారికంగా వినియోగిస్తూ పందెం కోళ్లను పెంపకం చేపట్టారు. చుట్టూ కంచె నిర్మించి మధ్యలో షెడ్ వేసి యథేచ్ఛగా కోళ్లను పెంచడం చూసి అధికారులు విస్మయానికి గురయ్యారు. దీనిపై అధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే సదరు నిర్వాహకులను పిలిచి తొలగించాలని ఆదేశించారు. అనంతరం అధికారులు క్రీడా ప్రాంగణం చుట్టూ ఉన్న తుప్పలను తొలగించే పనులను వేగవంతం చేశారు. మైదానం చుట్టూ తుప్పలతో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని శుభ్రం చేసి క్రీడా ప్రాంగణం మరింత అభివృద్ధి చేయడానికి ఉపయుక్తంగా అధికారులు తీర్చిదిద్దే పనిలో ఉన్నారు.

యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆచార్య రాజేంద్ర కర్మార్కర్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, ఆనంద్ మార్గ్ ప్రచారక సంఘం సంయుక్తంగా రెండు రోజుల యోగా, ధ్యాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించాయి. ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.రాజేంద్ర కర్మార్కర్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా అతిథులు ప్రభాత్ రంజన్ సర్కార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్ర కర్మార్కర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసికంగా ధృఢంగా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం ఉపకరిస్తాయన్నారు. రినైసెన్స్ యూనివర్సల్(ఆర్‌యూ) కార్యదర్శి ఆచార్య వితమోహానానంద విద్యార్థులకు యోగా ప్రాధాన్యత, నిత్య జీవనంలో ఉపయోగాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్‌యూ ప్రతనిధి నారాయణ పాండా, ఏయూ ఎన్ఎస్ఎస్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రామచంద్రరావు, స్టీల్‌ప్లాంట్ ఏజీఎం ఎ.వి.వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తల వెంట్రుకలు దానం చేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపాలని ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. వింగ్స్ ఫర్ లైఫ్, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో స్ట్రాండ్స్ ఆఫ్ హోప్ అండ్ కరేజ్ 'హెయిర్ డొనేషన్ డ్రైవ్' పోస్టర్‌ను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వింగ్స్ ఫర్ లైఫ్ ప్రతినిధులు జ్యోతిర్మయి, రష్మీ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు సీతమ్మధారలోని నేచురల్ బ్యూటీ సెలూన్‌లో ప్రజలు స్వచ్ఛందంగా తమ జుట్టును దానం చేయవచ్చని తెలిపారు.

లా విద్యార్థి నాగసాత్విక్‌కు అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థి బలభద్రుని నాగసాత్విక్‌ను ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఆచార్యులు అభినందించారు. ఇటీవల న్యూఢిల్లీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో సాత్విక్ పాల్గొని పార్లమెంట్ హాల్‌లో ప్రసంగించాడు. ఏయూ న్యాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న నాగసాత్విక్ దేశ ప్రధాని, ఇతర ప్రముఖుల సమక్షంలో ఎంతో అద్భుతంగా ప్రసంగించారు. తన నాయకత్వ, రచనా, సంభాషణ నైపుణ్యాలతో జాతీయ స్థాయిలో రాణించి కళాశాలకు, విశ్వవిద్యాలయానికి నాగ సాత్విక్ మంచి పేరు తీసుకొచ్చారని కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్యులు ప్రశంసించారు.